సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 31 । మే । 2025



పొగ.. ఆరోగ్యానికి సెగ

పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు డబ్ల్యూహెచ్‌ఓ ఏటా మే 31వ తేదీన ధూమపాన రహిత దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 10లో



టీడీపీలో వర్గపోరు

చెరువుల్లో మట్టిని తోలుకునేందుకు కూటమి నాయకులు పోటీ పడుతున్నారు. పలు గ్రామాల్లో టీడీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. 10లో



సర్టిఫికెట్ల పరిశీలన

ట్రిపుల్ ఐటీల్లో సీట్ల భర్తీకి సంబంధించి ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన మూడో రోజూ కొనసాగింది. 10లో

న్యూస్‌రీల్

'గురుకుల' ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: పోలసానిపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో గురుకుల సొసైటీ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే కౌన్సెలింగ్‌కు జోన్–2 పరిధిలోని ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లా, కృష్ణా జిల్లాల్లోని గురుకుల బాలుర, బాలికల కళాశాలలకు చెందిన 438 మంది ప్రిన్సిపాల్స్, జూనియర్ అధ్యాపకులు, పీజీటీలు హాజరుకానున్నారు. గురుకుల సొసైటీ సంయుక్త కార్యదర్శి ఎ.మురళీ సమక్షంలో కౌన్సెలింగ్ చేపట్టారు. తొలిరోజు 73 మందికి బదిలీ ఉత్తర్వులు అందించారు. టీజీటీ, స్పెషల్ టీచర్లు, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ల కేడర్లలోని ఉద్యోగులకు మంగళవారం కౌన్సెలింగ్ జరుగనుంది. డీసీఓ బీపీ ఉమాకుమారి, ఆయా జిల్లాల డీసీఓలు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులపై 152 కేసుల నమోదు



కలపర్రు టోల్ గేట్ వద్ద తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై 152 కేసులు నమోదు చేసినట్టు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. అలాగే రూ.5,01,500 అపరాధ రుసుం, పన్ను విధించినట్లు తెలిపారు. జిల్లాలోని వాహన తనిఖీ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేశామన్నారు. విశాఖ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖ మధ్య తిరిగే కాంట్రాక్టు క్యారేజ్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్టీఓలు కేఎస్ఎంఎస్ కృష్ణారావు, ఎండీ మదానీ, వాహన తనిఖీ అధికారులు ఎస్.రంగనాయకులు, జి.ప్రసాదరావు, జి.స్వామి, వై.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌పై మండిపాటు



ఏలూరులో కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు (టూటౌన్): ఆపరేషన్ కగార్ ఆపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ నక్సలైట్ల రహిత భారతదేశాన్ని 2026 నాటికి చూపిస్తామని చెబుతూ అడవి మీద ఆధారపడి జీవిస్తున్న గిరిజనులను అడవి నుంచి దూరంగా తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరిట అటవీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని మోదీ, అమిత్ షా ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెసు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు.

పట్టణ ప్రజలపై ఆస్తి పన్ను భారం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన ఆస్తి పన్ను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నును 20 శాతం పెంచాలని నిర్ణయించి ఆ మేరకు కొలతలు వేసే సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గత ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఆస్తి పన్ను పెంచబోమని హామీ ఇచ్చిన ఇప్పుడు తుంగలో తొక్కుతున్నారన్నారు.

కూలబడిన చదువులు

పేదల విద్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చేసింది. పేద విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అయితే గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు విద్యపై శీతకన్ను వేస్తోంది. తల్లికి వందనం పథకాన్ని తొలి ఏడాది అటకెక్కించి తల్లుల ఆశలపై నీళ్లు చల్లింది. పేదలపై ఫీజుల భారం మోపుతోంది. నాడు–నేడును నీరుగారుస్తోంది.

విద్యారంగం.. అస్తవ్యస్తం

- కూటమి ఏడాది పాలనలో అధోగతి
- అమలు కాని 'తల్లికి వందనం'
- రూ.138 కోట్ల మేర ఫీజు బకాయిలతో విద్యార్థుల ఇక్కట్లు
- విద్యారంగానికి పెద్దపీట వేసిన జగన్ సర్కారు
- నాడు–నేడులో రూ.369 కోట్లతో 1,150 పాఠశాలల అభివృద్ధి
- అమ్మఒడి ద్వారా 1,48,342 మంది తల్లులకు రూ.887.9 కోట్ల లబ్ధి
- ప్రపంచంతో పేద విద్యార్థులు పోటీపడేలా సంస్కరణలు

సాక్షి, భీమవరం : జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,436 ఉన్నాయి. శిథిల భవనాలు, పెచ్చులు ఊడే పైకప్పులు, రాళ్లు పైకిలేచిన ఫ్లోరింగులు, కలుషిత తాగునీరు, అధ్వానమైన టాయిలెట్లు, రక్షణ గోడలు లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు.. ఇది 2019లో వైఎస్సార్ ప్రభుత్వం వచ్చేనాటికి ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. నాటి సీఎం వైఎస్ జగన్ నాడు–నేడుతో మొదటి విడతగా 497 పాఠశాలల్లో రూ.116.13 కోట్లు విలువైన డిజిటల్ క్లాసురూంలు, తాగునీటి వసతి, టాయిలెట్స్, కిచెన్‌షెడ్లు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యుదీకరణ, మేజర్, మైనర్ మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేశారు. రెండో విడతగా జిల్లాలోని 764 పాఠశాలల్లో రూ.261.37 కోట్ల విలువైన 1,374 పనులు చేపట్టి ఎన్నికల నాటికి రూ.138.66 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో మిగిలిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.



గత ప్రభుత్వంలో ఆకివీడు హైస్కూల్‌లో ట్యాబ్‌ల ద్వారా విద్యాభ్యాసం సాగిస్తున్న విద్యార్థులు (ఫైల్)



ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని తింటున్న విద్యార్థినులు (ఫైల్)

గత ప్రభుత్వంలో చదువుల విప్లవం.. డిజిటల్ తరగతులు

దృశ్య, శ్రవణ విద్య ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంచేందుకు మాజీ సీఎం జగన్ అడుగులు వేశారు. 2022 డిసెంబరు 21న తన పుట్టినరోజున 8వ తరగతి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ట్యాబుల పంపిణీని ప్రారంభించారు. జిల్లాలోని 14,353 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి బైజూస్ కంటెంట్‌తో కూడిన రూ.30 వేల విలువైన ట్యాబ్‌లు అందజేశారు. తర్వాత ఏడాది 13,790 మందికి పంపిణీ చేశారు. తరగతి గదుల్లో డిజిటల్ విద్యాబోధన కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలు అందజేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ట్యాబుల పంపిణీని నిలిపివేసింది.



కూటమి పాలనలో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల భవన నిర్మాణం

అమ్మఒడితో చేయూత

పిల్లల చదువులకు పేదరికం అడ్డు కాకూడదని గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం కింద ఏటా రూ.15 వేల చొప్పున తల్లులకు ఆర్థిక సాయం అందిస్తూ వచ్చారు. కాగా చదువుకుంటున్న పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం తొలి ఏడాది ఆ ఊసే ఎత్తలేదు. జిల్లాలో 1,74,763 మంది విద్యార్థులకు రూ.15 వేల చొప్పున గత విద్యా సంవత్సరంలో రూ.262 కోట్ల తల్లికి వందనం సాయానికి ఎగనామం పెట్టింది.

ఉన్నత విద్యకు భరోసా

పేద విద్యార్థులు మధ్యలో ఉన్నత చదువులు మానేయకుండా జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాల ద్వారా గత ప్రభుత్వం ఆదుకుంది. గత ఐదేళ్లలో జగనన్న విద్యాదీవెన పథకం కింద 1,77,996 మంది విద్యార్థులకు రూ.485.33 కోట్లు సాయం అందించగా వసతి దీవెన పథకం కింద 1,76,142 మంది విద్యార్థులకు రూ.163.41 కోట్లు అందించారు. కూటమి ప్రభుత్వం సకాలంలో ఫీజులు చెల్లించక గత జనవరి నాటికి రూ.138.8 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది.

గతంలో అల్లారు 'ముద్ద'గా..

మధ్యాహ్న భోజనం మెనూలోను జగన్ **సర్కార్ ప్రత్యేక శ్రద్ధ** తీసుకుంది. ఆకర్షణీయ **మెనూతో రోజుకో కొత్త** రుచిని అందిస్తూ జగ**నన్న గోరుముద్ద పథకా**న్ని విజయవంతంగా **అమలు చేసింది. పో**షక విలువలు కలిగిన **పోర్టిఫైడ్ రైస్‌తో పాటు** రాగిజావ, కోడిగుడ్లు, **చిక్కీలతో విద్యార్థులకు** బలవర్ధకమైన పౌష్టి**కాహారాన్ని అందించిం**ది. కాగా డొక్కా సీత**మ్మ మధ్యాహ్న భోజన**ంగా పేరుమార్చిన కూ**టమి ప్రభుత్వం పెరి**గిన కాయగూరలు, ని**త్యావసర సరుకుల** ధరలకు అనుగుణంగా ధరలు సవరించక ఆహారంలో నాణ్యత లోపించడంతో ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

గత ప్రభుత్వంలో అమ్మఒడి సాయం

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2020	1,47,900	221.00
2021	1,51,401	226.90
2022	1,50,536	224.60
2023	1,43,534	215.40

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్పొరేట్‌ను తలదన్నేలా..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా వ్యవస్థను తలదన్నే రీతిలో తీర్చిదిద్దారు. మాజీ సీఎం జగన్ ప్రవేశపెట్టిన నాడు–నేడు ద్వారా సర్కారు బడులు అభివృద్ధి చెందాయి. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన అందించారు. అలాగే ట్యాబ్‌లలో, ఐఎఫ్‌బీ ప్యానెల్స్, బైజూస్ కంటెంట్ అందించారు. జగనన్న విద్యాకానుక వంటి మహత్తర పథకాలు అమలు చేశారు.

– ఎస్.జాకబ్ బాబు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



భీమవరంలో యోగాసనాల్లో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం ప్రాంగణంలో యోగ అభ్యసన కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను దిన చర్యగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. శారీరక, మానసిక దృఢత్వానికి యోగా సంజీవని అని అన్నారు. మహిళలు తమ జీవిత భాగస్వామికి కూడా యోగాపై అవగాహన కల్పించి యోగా కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మీ, సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి చెరుకువాడ సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

తండ్రి అరెస్ట్.. పరారీలో కుమారుడు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

భీమడోలు: నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసగిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని ఓ వ్యక్తిని భీమడోలు పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న షేక్ రసూల్ కలకాడను భీమడోలు కోర్టులో హాజరుపర్చారు. ఇదిలా ఉండగా ఇదే ముఠాలోని మరో వ్యక్తి అల్తాఫ్ పరారీలో ఉన్నాడు. భీమడోలులో సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడ ప్రాంతానికి చెందిన షేక్ రసూల్ కలకాడ, అతడి రెండో కుమారుడు అల్తాఫ్ రంగారెడ్డి జిల్లా గండిపేటలో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా వీరిద్దరూ తమకు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులతో సాన్నిహిత్యం ఉందని చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు ఎర వేస్తున్నారు. వారి నుంచి లక్షలాది రూపాయలు కాజేసి నకిలీ అపాయింట్‌మెంట్లతో మోసం చేస్తున్నారు. ఇలా పోలసానిపల్లికి చెందిన దివ్యాంగుడు కుక్కల నాగమల్లేశ్వరరావుకు ఏపీ సచివాలయంలోని వ్యవసాయ విభాగంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. నాగమల్లేశ్వరరావు నుంచి రూ.3 లక్షలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారు. ఇది నకిలీ లెటర్ అని తెలిసి మోసపోయినట్టు గ్రహించిన నాగమల్లేశ్వరరావు గతేడాది మే 26న భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా రంగారెడ్డి జిల్లా గండికోటలో ఉన్న రసూల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు ఛేదించిన బృందంలోని హెచ్‌సీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌కే బాజీ, ఎం.వెంకటేశ్వరరావులు సీఐ విల్సన్ అభినందించారు. అలాగే పూళ్లకి చెందిన దూలం సాయిబాబా అనే వ్యక్తికి పోలీస్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.20 లక్షలు తీసుకుని మోసం చేసిన కేసు ప్రస్తుతం కోర్టులో ఉంది. ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడేనికి చెందిన సుంకవల్లి శ్రావణ్‌కుమార్ అనే వ్యక్తి పొలం కొంటామని నమ్మించి, రెండు చెల్లని చెక్కులు ఇవ్వగా రసూల్, అల్తాఫ్‌లపై కేసు నమోదైంది.

కొల్లేరు ప్రాంతాల పరిశీలన

కైకలూరు: కొల్లేరు పరివాహక ప్రాంతాలను రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఎస్.రామశంకర్ నాయక్ (విశ్రాంత ఐఏఎస్) శుక్రవారం పరిశీలించారు. బుడమేరు డ్రెయిన్ కొల్లేరులో కలిసే ప్రాంతమైన పెదపాడు మండలం గోగుంట గ్రామంలో పరిశీలన చేశారు. అనంతరం మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన వద్ద నీరు లేక ఎండిన ప్రాంతాన్ని చూశారు. కొవ్వాడలంక గ్రామస్తులతో ముచ్చటించారు. సొసైటీ భూముల వివరాలు తెలుసుకున్నారు. అక్కడ నుంచి ఆటపాక పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. ఈఈసీ కేంద్రం వద్ద పక్షి నమూనా మ్యూజియాన్ని సందర్శించారు. వలస పక్షుల వివరాలు, సొసైటీ, డీ–ఫాం భూముల వివరాలను తెలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర కమిటీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. స్టేట్ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎంవీ సునీల్‌కుమార్ వర్మ (ఉండి), స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా మానుకొండ ప్రదీప్ (భీమవరం), స్టేట్ యూత్ వింగ్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా బర్రి సమోర్ (నరసాపురం), స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీలుగా కొవ్వూరి వేణుమాధవ్ రెడ్డి (ఆచంట), కొవ్వూరి విజయభాస్కర్ రెడ్డి (తాడేపల్లిగూడెం), సత్తి రాజశేఖరరెడ్డి (తణుకు), స్టేట్ వలంటీర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా కళ్యాణ్ చక్రవర్తి (ఆచంట), స్టేట్ వలంటీర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా పాలపర్తి సందీప్ (పాలకొల్లు), స్టేట్ ఐటీ వింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా నవరం కిశోర్ (భీమవరం), స్టేట్ వాణిజ్య విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా ఉనికిలి శ్రీను (పాలకొల్లు), స్టేట్ వాణిజ్య విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా కంకటాల నాగ సత్యనారాయణ (తణుకు) నియమితులయ్యారు.

స్టాక్ పాయింట్లకు ఇసుక

భీమవరం (ప్రకాశంచౌక్): వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా స్టాక్ పాయింట్లకు తరలించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా పెండ్యాలలోని ఓపెన్ ఇసుక రీచ్‌ను జిల్లాకు కేటాయించారన్నారు. అక్కడి నుంచి భీమవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఉండి తాడేపల్లిగూడెంలోని స్టాక్ పాయింట్లకు ఇసుక రవాణా చేసేందుకు వాహన చార్జీలపై అధికారులతో చర్చించారు. పెనుగొండ మండల సిద్ధాంతం వద్ద కొత్త స్టాక్ పాయింట్ ఏర్పాటుపై పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు కలెక్టరేట్‌లో ముగ్గురికి కరోనా

ఏలూరు టౌన్: కరోనా వైరస్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. తాజాగా ఏలూరు జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లోని ముగ్గురు ఉద్యోగులకు కరోనా పాజిటివ్ వచ్చినట్టు తెలిసింది. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ముగ్గురికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు విశ్వసనీయంగా తెలిసిన సమాచారం. ఈ ముగ్గురు ఉద్యోగులను హోమ్ ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించినట్టు తెలిసింది. దీనిపై అధికారులు మాత్రం గోప్యత పాటిస్తున్నారు. అప్రమత్తం చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ జిల్లా సమావేశం

పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు వెల్లడి



ముదునూరి ప్రసాదరాజు

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం పెదఅమిరంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు, ఏడాది పాలనలో ప్రజలకు చేసిన వంచనకు నిరసనగా జూన్ 4న 'వెన్నుపోటు దినం'గా పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారన్నారు. సీఎం చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై ఆ రోజు నిరసన తెలపనున్నట్టు ప్రసాదరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై చర్చించేందుకు ఆదివారం ఉదయం సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఇతర పెద్దలు సమావేశానికి హాజరవుతారన్నారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సమన్వయ కమిటీ సభ్యులు, నేతలు హాజరుకావాలని ప్రసాదరాజు కోరారు.

చించినాడలో దాహం కేకలు



చించినాడ సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

యలమంచిలి: మండలంలోని చించినాడలో తాగునీటి కోసం సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద సంఖ్యలో మహిళలు ఖాళీ నీటి బిందెలతో ధర్నా చేశారు. ముఖ్యంగా గ్రామంలోని దళిత, అరుంధతీ కాలనీల్లో సమస్య ఎక్కువగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ బిల్లు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి జయప్రభ, జిల్లెల్ల ప్రశాంతి, బాతిరెడ్డి సుగుణ, గొల్ల విజయకుమారి, ముస్కుడి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధలు తాళలేక..

- కుటుంబం ఆత్మహత్యాయత్నం
- కుటుంబ యజమాని మృతి
- చికిత్స పొందుతున్న భార్య, కుమారుడు, కుమార్తె



మంగిన చంద్రం (ఫైల్)

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ఓ కుటుంబం అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యాయత్నం చేయగా.. చికిత్స పొందుతూ కుటుంబ యజమాని శుక్రవారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక లక్ష్మి ఆస్పత్రి సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో మంగిన సత్యదుర్గాచంద్రరావు (చంద్రం) (40) భార్య, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నారు. గురువారం వీరు కూల్‌డ్రింక్‌లో కలుపు మందు కలిపి సేవించారు. స్థానికులు వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చంద్రరావు, భార్య కృష్ణజ్యోతి, కుమారుడు దుర్గాచరణ్, కుమార్తె కోమలికి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి గుంటూరు తరలించారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ చంద్రరావు శుక్రవారం మృతిచెందారు. భార్య, కుమారుడు, కుమార్తె అక్కడే చికిత్స పొందుతున్నారు. వారికి రక్తం శుద్ధి చేసేందుకు డయాలసిస్ చేస్తున్నట్టు బంధువులు తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర మాట్లాడుతూ చంద్రరావు కుటుంబం అప్పుల బాధ తాళలేక కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు ప్రాథమికంగా తమకు తెలిసిందన్నారు. దీనిపై విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

పొగ.. ఆరోగ్యానికి సెగ

- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం
- జిల్లాలో పొగాకు సంబంధ వ్యాధిగస్తులు 2,354 మంది
- వ్యసనపరులకు టీసీసీ సెంటర్ ద్వారా వైద్య చికిత్స



కైకలూరు: పొగాకు వినియోగదారులు వ్యసన చక్రంలో బందీ అవుతున్నారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా ప్రమాదమే. దీని వల్ల గొంతు కేన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెపోటు వంటి సమస్యలు దాపరిస్తున్నాయి. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఏటా మే 31వ తేదీన ధూమపాన రహిత దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'పొగాకు ఉత్పత్తుల ఆకర్షణలు తగ్గించడం' అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కలిగిస్తున్నారు. ఏలూరు జిల్లాలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో పొగాకు వినియోగ అనర్థాలపై శనివారం అవగాహన కలిగించనున్నారు.

ఆకర్షితులవుతున్న యువత

యుక్తవయస్సులో సిగరెట్‌కు యువత ఆకర్షితులవుతున్నారు. పొగాకు ఉత్పత్తుల్లో నికోటిన్ అనే పదార్థం ఉంటుంది. అందువల్ల వ్యసనం నుంచి త్వరగా బయట పడలేకపోతున్నారు. విద్యార్థి దశ నుంచి కొంతమంది ఫ్యాషన్‌గా సిగిరెట్‌కు అలవాటు పడుతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ధూమపానం వల్ల పురుషులు, స్త్రీలలో సంతానోత్పత్తి సమస్యలు వస్తున్నాయి.





ఏలూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పొగాకు వ్యసనపరులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సైకాలజిస్టు వీర్రాజు

కేన్సర్ల ముప్పు..

సిగిరెట్, బీడీ, చుట్టా, జరదా, గుట్కా, తంబాకు వంటి పొగాకు ఉత్పత్తులకు ప్రజలు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వీటి బారిన పడిన వారికి తల, మెడ, నోరు, ఊపిరితిత్తులు, రక్త, మూత్రపిండాలు, ప్లీహము, పేగు, మూత్రసంచి, గర్భాశయ కేన్సర్లు కలుగుతున్నాయి. అదే విధంగా పక్షవాతము, అంధత్వము, చిగురు వాపు, గుండె వ్యాధులు, నిమ్ము, ఆయాసం, రక్తనాళాలు గట్టిపడటం, సంతానోత్పత్తి తగ్గిపోవడం, ఎముకలు బలహీనపడుట వంటి దీర్ఘకాలిక వ్యాధులతో శరీరంలో ప్రతి అవయవం దెబ్బతింటోంది. పొగాకు వల్ల ప్రపంచంలో ప్రతి ఏటా 8 మిలియన్లు పైగా మరణాలు సంభవిస్తున్నాయని అంచనా.

జిల్లాలో 2,354 మంది వ్యాధిగ్రస్తులు

ఏలూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఈ ఏడాది ఇప్పటి వరకు 2,354 మంది పొగాకును వివిధ రూపాల్లో ఉపయోగించిన వ్యాధిగ్రస్తులను గుర్తించారు. వ్యసనపరులకు ఏలూరు సర్వజన ఆస్పత్రిలో రూం నంబరు 15లో టొబోకో సస్సెషన్ వైద్యశాల(టీసీసీ)లో చికిత్స అందిస్తున్నారు. మొత్తం వ్యాధిగ్రస్తులలో 146 మంది పూర్తిగా కోలుకున్నారు. మరో 955 మంది కోలుకునే దశలో ఉన్నారు. వ్యసనపరులకు వైద్యులు నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీతో వ్యసనాన్ని తగ్గిస్తున్నారు. కార్బన్ మోనాక్సైడ్ అనలైజర్ అనే పరికరం ద్వారా రక్తంలో లెవల్స్‌ను పరీక్షించి, అనంతరం సైకాలజిస్టుతో కౌన్సిలింగ్ థెరపీ అందిస్తున్నారు.

పొగాకు బారిన పడవద్దు



పొగాకు వాడకం వల్ల ప్రజల జీవితాలు నాశనం చేసుకొంటున్నారు. ప్రధానంగా నోటి, స్వరపేటిక, ఊపిరితిత్తులు, క్లోమగ్రంథి, మూత్రాశయ కేన్సర్లు సంభవిస్తాయి. గుండె పోటుతో అకాల మరణాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది. జిల్లా సర్వజన ఆస్పత్రిలో పొగాకు విరమణ వైద్యశాల(టీసీసీ) అందుబాటులో ఉంది. పొగాకు ఉత్పత్తులకు అందరూ దూరంగా ఉండండి.

– డాక్టర్ ఆర్.మాలిని, జిల్లా వైద్యాధికారి, ఏలూరు

పీల్చడమూ ప్రమాదమే



సిగిరెట్లులను కాల్చడమే కాదు.. ఆ పొగను పీల్చినా ప్రమాదమే. కొందరు సరదాగా పొగాకునకు అలవాటు పడి వ్యసనపరులుగా మారుతున్నారు. ప్రధానంగా యువత వీటికి ఆకర్షితులవుతున్నారు. గుండె పోటు మరణాల్లో ధూమపానం అలవాటు ఉన్నవారే ఎక్కువగా ఉంటున్నారు. పొగాకు రహిత సమాజానికి అందరూ సహకరించాలి.

– డాక్టర్ నరేంద్ర, ప్రోగ్రాం ఆఫీసర్, ఎన్‌సీడీ, ఏలూరు

వ్యసనపరుల్లో మార్పు



ఏలూరు సర్వజన ఆస్పత్రిలో టొబోకో సస్సెషన్ క్లినిక్(టీసీసీ) అందుబాటులో ఉంది. ఈ సెంటర్‌లో ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 5 వేల మందికి వైద్య సేవలు అందించాం. వ్యసనపరులకు నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీని అందిస్తున్నాం. పూర్తిగా పొగాకు మానివేసిన వాళ్లను ఆరు నెలల వరకు పరిశీలిస్తున్నాం. ధూమపానానికి అలవాటు పడిన వారిని టీసీసీ ద్వారా మామూలు స్థితికి తీసుకొస్తున్నాం.

– కె.చిన వీర్రాజు, సైకాలజిస్టు, గవర్నమెంట్ జనరల్ హాస్పటల్, ఏలూరు

క్లుప్తంగా

చట్టాన్ని ఎమ్మెల్యేలు హైజాక్ చేస్తున్నారు



మాట్లాడుతున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): పంచాయతీరాజ్ చట్టాన్ని ఎమ్మెల్యేలు హైజాక్ చేస్తూ సర్పంచ్‌ల విధులు, హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని ఏలూరు ఎస్‌ఆర్‌పేటలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలు అధికారులను అడ్డంపెట్టుకుని పంచాయతీల్లో సర్పంచ్‌లకు ఉన్న హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. పంచాయతీ రాజ్ చట్టాన్ని సక్రమంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్ చిలకా సుబ్బారావు, నాయకులు నూకపెయ్యి కార్తీక్, కనికెళ్ళ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు: ట్రిపుల్ ఐటీల్లో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల్లో భాగంగా ప్రత్యేక కేటగిరి సీట్ల భర్తీకి గాను ఆయా కేటగిరికి చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మూడోరోజు శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ నందు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా క్రీడా కోటాకు సంబంధించి 467మందికి గాను 344 మంది, ఎన్‌సీసీ కోటాకు సంబంధించి 452 మందికి గాను 354 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, ఏఆర్ అర్జునరావు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 31న ఎన్‌సీసీ కేటగిరికి చెందిన 661మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



షేక్ రియాజ్ (ఫైల్)

ఉండి: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉండిలో గురువారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. వివరాల ప్రకారం ఆకివీడుకు చెందిన షేక్ రియాజ్ (41) స్థానిక క్రికెటర్. అతను ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో మెడికల్‌షాపు ఇన్‌చార్జ్‌గా పనిచేయడంతోపాటు, క్రికెట్ అకాడమీ నిర్వహిస్తున్నాడు. గురువారం అండర్‌–19 క్రికెట్ సెలక్షన్స్ గురించి మాట్లాడేందుకు ద్విచక్రవాహనంపై భీమవరంలో వెళ్లిన అతను తిరిగి అర్ధరాత్రి 1.30 గంటలకు ఆకివీడు వస్తుండగా ఉండిలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కరెంటుస్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. షేక్ రియాజ్ భార్య పర్వీన్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నపిల్లలపై పిచ్చి కుక్క దాడి



శునకం దాడిలో నవదీప్ చేతికి అయిన గాయాన్ని చూపుతున్న అతని తల్లి

ద్వారకాతిరుమల: గత నాలుగు రోజుల నుంచి క్షేత్రంలోని చెరువు వీధిలో ఒక పిచ్చి కుక్క పిల్లలపై దాడి చేస్తోంది. ఇప్పటి వరకు దాదాపు 10 మంది పిల్లలపై ఈ కుక్క దాడి చేసి, తీవ్రంగా గాయపరచింది. శుక్రవారం సాయంత్రం చెరువు వీధిగుండా శ్రీవారి ఆలయానికి వెళుతున్న లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సాయిల రవి అనే భక్తుడి కుమారుడు యశ్వంత్‌పై ఈ కుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడి కాలికి తీవ్ర గాయమైంది. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కొల్లిసుబ్బారావు క్షతగాత్రుడిని హుటాహుటీన పీహెచ్‌సీకి తరలించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన గుడాల మదన్‌మోహన్ కుమారుడు నవదీప్‌పై కుక్క దాడి చేసి, కొంత దూరం ఈడ్చుకెళ్లింది. స్థానికులు వెంటపడటంతో బాలుడిని విడిచిపెట్టి పరారైంది. వెంటనే తల్లిదండ్రులు అతడిని పీహెచ్‌సీకి తరలించగా, వైద్య సిబ్బంది చిన్నారులకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. సమాచారం అందుకున్న డిప్యూటీ ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ పిచ్చి కుక్కను పంచాయతీ పారిశుధ్య కార్మికులతో పట్టించి, దూర ప్రాంతానికి తరలించారు.

పోక్సో కేసులో లాడ్జి యజమాని అరెస్ట్

భీమవరం: మైనర్ బాలికలను వ్యభిచారానికి ప్రోత్సహిస్తున్న నేరంలో భీమవరం టూటౌన్ పరిధిలోని శ్రీనిధి లాడ్జి యజమాని అయితం శ్రీనివాస్‌ను పోక్సో కేసులో శుక్రవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ జి కాళీచరణ్ చెప్పారు. ఈనెల 12న వ్యభిచారం నేరంపై బాలికలను అరెస్ట్ చేయగా వారికి రూమ్స్ అద్దెకిచ్చిన శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామని, 14 రోజుల రిమాండ్ విధించడంతో నరసాపురం సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ చెప్పారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

పెదవేగి : ప్రేమ పేరుతో లోబరుచుకుని అనంతరం నిర్లక్ష్యం చేస్తుండడంతో మనస్తాపం చెందిన మైనర్ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన పెదవేగి మండలం రామచంద్రపురంలో చోటు చేసుకుంది. ఏడాది కాలంగా గ్రామానికి చెందిన యువకుడు హెచ్చు గణేష్, మైనర్ బాలిక మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తుంది. ప్రస్తుతం ఆమెను నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఆమె ఫోన్‌ను గణేష్ బ్లాక్ చేయడంతో మనస్తాపానికి గురైన బాలిక శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు పెదవేగి ఎస్సై కె రామకృష్ణ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాళ్ల: సీసలిలో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. వివరాల ప్రకారం సీసలి గ్రామంలో అడుగంటిన చెరువులో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. స్థానిక వీఆర్వో సుధాకర్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 40 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఒంటిపై నైట్ ప్యాంటు మాత్రమే ఉండి, కుళ్లిన స్థితిలో మృతదేహం ఉందన్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఏఎస్సై వీవీఎస్ రామరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మట్టి కోసం టీడీపీలో వర్గపోరు

- ఒక వర్గం మట్టి తోలుతుంటే.. అడ్డుకుంటున్న మరో వర్గం
- నూజివీడు పెద్దచెరువులో మట్టితోలకాలను అడ్డుకున్న నీటి సంఘం సభ్యులు, రైతులు
- కొన్నంగుంటలో అర్ధరాత్రి మట్టి అక్రమ తవ్వకాలు





నూజివీడు పెద్ద చెరువులో మట్టి తోలకాలను అడ్డుకోవడంపై టీడీపీ నాయకుల వాగ్వివాదం, కొన్నంగుంటలో అర్ధరాత్రి ట్రాక్టర్లలో మట్టిని తోలుతున్న టీడీపీ నాయకులు

నూజివీడు: చెరువుల్లో మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకునేందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లుగా ఉంది. చెరువుల్లో మట్టిని తాము తోలుకోవాంటే తాము తోలుకుంటామంటూ నాయకులు పోటీ పడుతున్నారు. పలు గ్రామాల్లో మట్టి కోసం వర్గపోరు తారాస్థాయికి చేరింది. కొన్నిచోట్ల ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మట్టితోలకాలను యథేచ్ఛగా నిర్వహిస్తుంటే మరి కొన్ని చోట్ల చెరువుల్లో మట్టిని అనుమతులు లేకుండా ఎలా తోలతారని టీడీపీ నాయకులే అడ్డుకుంటున్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న రైతులు

నూజివీడు పట్టణంలోని పెద్దచెరువులో మాజీ కౌన్సిలర్ టీడీపీ నాయకుడు వేమూరి వెంకట కృష్ణారావు ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకొని మట్టి తోలకాలను శుక్రవారం చేపట్టగా అదే పెద్దచెరువు సాగునీటి సంఘం సభ్యులు, రైతులు తమ చెరువులో మట్టిని తోలడానికి వీల్లేదని మట్టిని తోలకుండా అడ్డుకున్నారు. వేమూరు వెంకట కృష్ణారావుకు ఆర్ఎస్ నెంబరు 871–3లోని ఎకరం భూమిని మెరక చేసుకొనుటకు గాను వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టిని పెద్ద చెరువు నుంచి తవ్వి తీసుకెళ్లేందుకు గాను ఇరిగేషన్ ఈఈ అనుమతి ఇచ్చారు. దీంతో మట్టి తవ్వకాలను చేపట్టగా సాగునీటి సంఘం సభ్యులు, ఆయకట్టు రైతులు అడ్డుకోవడంతో కొంతసేపు వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చెరువుకు నాలుగు చోట్ల గండ్లు పడి దాదాపు 10నెలలు గడిచినా ఇంత వరకు గండ్లు పూడ్చకుండా చెరువులో మట్టిని వేరే వాళ్లు ఎలా తవ్వుకొని తీసుకెళ్తారని రైతులు ప్రశ్నించారు. అసలు అనుమతుల కోసం దరఖాస్తు పెట్టేటప్పుడు కనీసం నీటి సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సంప్రదించకుండా ఎలా మట్టిని తవ్వుతారని నిలదీశారు. సాగునీటి సంఘం సభ్యులు ట్రాక్టర్లను అడ్డుకోవడాన్ని టీడీపీకి చెందిన కొందరు మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ వ్యవహారంపై మంత్రి ఎలా స్పందిస్తారోనని ఆసక్తి నెలకొంది.

కొన్నంగుంటలో మట్టి అక్రమ తవ్వకాలు

మండలంలోని బోర్వంచ శివారు కొన్నంగుంటలోని గోరింత చెరువులో గురువారం అర్ధరాత్రి నుంచి తెల్లవార్లూ అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగాయి. ట్రాక్టర్లలో మట్టి తరలిపోయింది. గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు మట్టి అక్రమ తవ్వకాలకు తెరలేపి ఇష్టారాజ్యంగా కొనసాగించారు. అక్రమ తోలకాలు చేస్తున్నట్లు తెలుసుకున్న బోర్వంచ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు హరికోటి సంగీతరావు ట్రాక్టర్లను ఆపి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని ఎందుకు తోలుతున్నారని నిలదీశారు. అయినప్పటికీ మా ఇష్టం వచ్చినట్లుగా మేము తోలతామని చెప్పి ట్రాక్టర్లలో మట్టిని అడ్డూ అదుపూ లేకుండా తెల్లవార్లు తరలించారు.

సోలాపూర్‌లో యాత్రికుల లగేజీ దోపిడీ



సోలాపూర్‌లో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మక్కినవారిగూడెంకు చెందిన యాత్రికులు



వారు ప్రయాణించిన బస్సు ఇదే

ఏలూరు: టి.నరసాపురం మండలం మక్కినవారిగూడానికి చెందిన యాత్రికులు సోలాపూర్ సమీపంలో దోపిడీకి గురయ్యారు. యాత్రికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మక్కినవారిగూడానికి చెందిన 24మంది ఈ నెల 27న రైలులో షిర్డీ వెళ్లారు. 29వ తేదీ రాత్రి షిర్డీ నుంచి సోలాపూర్‌కు చెందిన శివబాబా ట్రావెల్స్ బస్సును మాట్లాడుకుని బస్సులో సోలాపూర్ బయలుదేరారు. వారి లగేజీ బ్యాగ్‌లను బస్సు డిక్కీలో ఉంచారు. 30వ తేదీ ఉదయం సోలాపూర్‌లో బస్సు దిగి డిక్కీ తెరిచి చూడగా, డిక్కీలో పెట్టిన దాదాపు 24 మందికి చెందిన బ్యాగులు మాయమయ్యాయి. వాటిలో దాదాపు విలువైన బట్టలతో పాటు రూ.70 వేల నగదు ఉంటుందని యాత్రికులు తెలిపారు. బస్సు ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో డ్రైవర్ పలు చోట్ల ఆపి కిందకు దిగినట్లు యాత్రికులు చెబుతున్నారు.

దీంతో బస్సును సోలాపూర్‌లో పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి యాత్రికులు ఆందోళన చేశారు. ఈ ఘటనపై మక్కినవారిగూడెంకు చెందిన దొంతు లక్ష్మీనారాయణతో పాటు మరికొందరు కలిసి ఫిర్యాదు చేశారు. సాయంత్రానికి పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని యాత్రికులకు ఇచ్చారు. యాత్రికులంతా సోలాపూర్ చుట్టుపక్కల పర్యటించి జూన్ 1వ తేదీన 8 గంటలకు సోలాపూర్ నుంచి విజయవాడకు రైలు ఎక్కాల్సి ఉంది. రిజర్వేషన్ టిక్కెట్‌లు సైతం ఆ బ్యాగ్‌లోనే ఉన్నాయని, తిరుగు ప్రయాణానికి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని యాత్రికులు తెలిపారు.

థింక్ ఇండియాతో నిట్ ఎంఓయూ



ఒప్పంద పత్రాలతో థింక్ ఇండియా, నిట్ సభ్యులు

తాడేపల్లిగూడెం: బెంగళూరుకు చెందిన థింక్ ఇండియా సంస్థతో ఏపీ నిట్ శుక్రవారం ఎంఓయూ చేసుకుంది. ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐఎస్‌సీ, ఐఐఎం, నింహాన్స్, ఎన్‌ఎల్‌ఏఐయూ వంటి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు 2006లో ఈ థింక్ ఇండియా సంస్థను స్థాపించారన్నారు. వారి సలహాలు, సూచనలు నిట్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇంటర్న్ షిప్ చేసుకొనే వెసులుబాటు కూడా ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు సిద్ధం చేయడం, పర్యావరణ, సాంస్కృతిక భద్రత అంశాల్లో చైతన్యం తీసుకురావడం, భారతీయ విలువల ప్రోత్సాహం, రాష్ట్ర ఐక్యత, సామాజిక సమతుల్యతను పెంచడం వంటి విషయాలను పంచుకొనేందుకు ఈఅవగాహన ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి, ప్రొఫెసర్ రవికిరణ్ శాస్త్రి, అసోసియేట్ డీన్ రాజేశ్వరరెడ్డి, థింక్ ఇండియా రాష్ట్ర కో కన్వీనర్ ప్రణవ్ పాల్గొన్నారు.

జ్యూయలరీ వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఒక జ్యూయలరీ వ్యాపారి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు తూర్పువీధి ప్రాంతానికి చెందిన ఉప్పు నాగరాజు (61) ఏలూరు మెయిన్‌బజార్‌లో జ్యూయలరీ షాపు నిర్వహిస్తున్నాడు. గతేడాది ఆయన గుండె వ్యాధితో స్టంట్ వేయించుకున్నారు. మధుమేహ వ్యాధి కారణంగా కాలు కొంత భాగాన్ని వైద్య చికిత్స చేసి తొలగించారు. మరోవైపు కిడ్నీ వ్యాధి సమస్యతో కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న నాగరాజు జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా బాషా నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరుకువాడలో ఆగని మట్టి రవాణా



చెరుకువాడలో మట్టి అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

ఉండి: చెరుకువాడలో మట్టి అక్రమ రవాణా ఆగడం లేదు. మాకు అడ్డు చెప్పేది ఎవరు.. మమ్మల్ని ఆపేది ఎవరు అన్నట్టుంది ఇక్కడి వ్యవహారం. ఒకవేళ గ్రామ స్థాయి అధికారులు అడ్డుకుంటున్నా వారిపై మండల స్థాయి అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తుండడంతో మట్టి అక్రమ రవాణాను ఆపడం సాధ్యం కావడం లేదు. మట్టి యథేచ్ఛగా తరలిస్తుండడంతో ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా ఉన్నత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం చెరుకువాడ శివారు అర్తమూరు రోడ్డులో డంపింగ్ చేసి భద్రపరచుకున్న మట్టిని పెద్ద ఎత్తున ట్రాక్టర్‌లతో రవాణా చేశారు. దీనిపై ప్రజల ఫిర్యాదుతో క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన గ్రామాధికారి తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. కారణం ఒక వైపు ప్రజలు, మరోవైపు మండలాధికారుల సహకారం లేకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 19న చెరుకువాడ మీదుగా పెద్ద ఎత్తున వెళుతున్న మట్టి ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకుని అధికారులు వచ్చి సమాధానం చెబితేనే గాని వదిలిపెట్టమంటూ పట్టుబట్టారు. దీంతో ఆ ఒక్కరోజు మాత్రమే మట్టి రవాణాను అడ్డుకున్న అధికారులు ఆ తరువాత నుంచి పట్టించుకోలేదు. దీంతో మట్టి అక్రమ రవాణాదారుల నుంచి ఉన్నత అధికారులకు ఏ స్థాయిలో తాయిలాలు అందుతున్నాయో అంటూ ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. దీంతో ప్రజలు మళ్లీ మట్టి ట్రాక్టర్‌లను అడ్డుకునేందుకు సమాయత్తం కాగా అధికారులు వాటిని నిలుపుదల చేశామని చెప్పారు.

ఘనంగా దర్శకరత్న దాసరి వర్ధంతి



దాసరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

పాలకొల్లు సెంట్రల్: తెలుగు సినీ పరిశ్రమలో దర్శకుడిగా అత్యధిక చిత్రాలు తీసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సృష్టించి పాలకొల్లు కీర్తిని ప్రపంచం నలుమూలలా వ్యాపింపజేసిన సినీ దిగ్గజం దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావుకే దక్కుతుందని పలువురు దాసరి అభిమానులు ఆయన సేవలను కొనియాడారు. శుక్రవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నందు పట్టణ నటీనట సంక్షేమ సమాఖ్య, దాసరి నారాయణరావు అభిమానుల ఆధ్వర్యంలో దాసరి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ నటీనట సంక్షేమ సమాఖ్య సభ్యులు, దాసరి అభిమానులు మాట్లాడుతూ సినీ ఇండస్ట్రీలో అనేక మైలురాళ్లు దాటిన ఘనత దాసరికే సాధ్యమైందన్నారు. అలాగే పట్టణంలో మహిళా కళాశాలకు భూమి విరాళంగా ఇచ్చి విద్యాదాతగా కీర్తిని పొందారన్నారు. అలాగే పట్టణంలో గాంధీబొమ్మల సెంటర్ వద్ద రాజ్యసభ నిధులతో కాలిబాట వంతెన ఏర్పాటు ఎంతో మందికి మార్గం సుగమం చేశారన్నారు. కార్యక్రమంలో వంగా నరసింహరావు, మేడికొండ శ్రీనివాసరావు, యర్రంశెట్టి వెంకటరత్నం, కొట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో పాము కలకలం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో శుక్రవారం ఉదయం ఒక పాము కలకలాన్ని రేపింది. దాంతో దేవస్థానం సిబ్బంది దాన్ని పట్టుకుని దూరంగా తీసుకెళ్లి విడిచిపెట్టారు. స్థానికుల కథనం ప్రకారం. ఆలయ ఉత్తరగోపురం వైపు ఉన్న రూ. 200 దర్శనం క్యూలైన్లలోకి ఆ పాము ప్రవేశించడంతో అక్కడున్న భక్తులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన దేవస్థానం సిబ్బంది ఆ పామును గోనె సంచెలో పట్టి, దూరంగా తీసుకెళ్లి విడిచిపెట్టారు. దాంతో భక్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్.ఓ.సి.నెం.912/2025/ఇ1 మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు
డి.30–05–2025.

ఇ - ప్రొక్యూర్ మెంటు టెండరు నోటీసు

[illegible]

కమీషనరు,
పాలకొల్లు పురపాలక సంఘము

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■ 330 sq.yards plot with 6 feet width passage for sale in Jawahar St, Opp. CMR Jewellery Mall, Kakinada No. Brokers. 9949507969 [SCA-25004320]

Wanted

■ సాయిరామ్ హోంకేర్. Hydలో బేబి కేర్, పేషెంట్ కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సు లు ఇంటిపని/వంటపనికి మనుషులు (ఆడ/మగ) కావలెను. జీ: 18 వేలు. 9949094607, 9908454607 [SCA25004276]

■ కన్సల్టేన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15904]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (VJA బ్రాంచి) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషంట్ల సేవకు వంట / ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+వసతి+ జీతం: 16-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 63010 53690, 82475 00574 [B-1275560]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం TG No.1 Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని,బేబీకేర్‌కు M/F వర్కర్స్ కా:భో+వసతి+జీతం 16–18 వేలు ఫోన్: 9133271122/ 9515119430 [SCA25004282]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్త దేవీవరప్రసాదరెడ్డి

తాడేపల్లిగూడెం: వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రకాశరావుపాలెం, ఆవపాడు, సింగరాజుపాలెం గ్రామాల రైతులకు సార్వాసాగు నూతన సాంకేతిక పరిజ్ఞానం, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వరిలో రైతుల సమస్యలు పరిష్కారాలు, కూరగాయల సాగులో మేలైన వంగడాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఆయిల్ ఫాం, కోకో, కొబ్బరి పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. భారత వ్యవసాయపరిశోధన మండలి సైంటిస్టులు, మార్టేరు వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు, ఆయిల్ ఫామ్ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కె.రామచంద్రుడు,మేరీ రాణి, భువనేశ్వరి, కెవికె శాస్త్రవేత్తలు ఉద్యానశాఖ అధికారి బబిత తదితరులు పలు విషయాల గురించి వివరించారు.

ఘనంగా గోగులమ్మ జాతర మహోత్సవం



జాతర మహోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసియున్న గోగులమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండోవ రోజు శుక్రవారం అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారి నుంచి నైవేధ్యాలు సమర్పించారు. 108 బిందులతో జలాలు, పసుపు, కుంకుమ, వేపాకుల వేసి గ్రామోత్సవం జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాను దినచర్యగా పాటించాలి



తణుకులో యోగాసనాలు వేస్తున్న అధికారులు

తణుకు అర్బన్: యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యగా పాటిస్తే మంచి ఆరోగ్యంగా ఉండవచ్చని మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు మునిసిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగాసనాలతో పాటు ప్రాణాయామం పాటిస్తే ఎన్నో రకాల రోగాలకు సంజీవనిలా పనిచేస్తుందని అన్నారు. వ్యాపార, ఉద్యోగపరంగా తీవ్ర ఒత్తిడి నెలకొన్న నేటి రోజుల్లో యోగా మానసిక ఒత్తిడిని దూరం చేస్తుందని, ఇప్పటికే అధికశాతం యోగా బాట పడుతున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యోగా గురువు కర్రి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌తోపాటు మునిసిపల్ ఉద్యోగులు యోగాసనాలు వేశారు.

రూ.110 కోట్లతో మూడో ఫ్లై ఓవర్ వంతెన

తాడేపల్లిగూడెం: జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ గూడెం, జువ్వలపాలెం, కుంచనపల్లి మీదుగా సుమారు రూ.110 కోట్ల వ్యయంతో మూడో ఫ్లైవోవర్ వంతెన నిర్మాణానికి రైల్వే శాఖ అనుమతులు వచ్చాయని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రూ.300 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులకు అనుమతు లు వచ్చాయని, రూ.200 కోట్ల పనులకు టెండర్లు పిలిచారని వివరించారు. త్వరలో జువ్వలపాలెం గేట్‌నంబర్ 374, నవాబు పాలెం గేట్ నంబరు 378, ఆరుళ్ల గేట్ నంబరు 379 పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు.

దోపిడీ లేని రాజ్యాధికారమే సీఐటీయూ లక్ష్యం

భీమవరం: దోపిడీలేని కార్మిక వర్గ రాజ్యాధికారమే సీఐటీయూ లక్ష్యమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి వాసుదేవరావు అన్నారు. శుక్రవారం భీమవరం సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. ఐక్యత పోరాటం నినాదంతో ఉద్యోగ, కార్మికుల పక్షపాతిగా పాలకవర్గాలు తెస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ కార్మిక వర్గాన్ని చైతన్య పరుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని సీఐటీయూ పిలుపునిస్తుందన్నారు.

పేదల విద్యపై కూటమి కక్ష

- సంక్షేమం ఇవ్వకుండా ఏడాది గడిపేశారంటూ ప్రజల విమర్శలు
- అమ్మ ఒడి ఆపేశారు.. తల్లికి వందనం ఇవ్వలేదు
- జగన్ ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత
- అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, నాడు నేడుతో విరాజిల్లిన పాఠశాలలు
- కూటమి ప్రభుత్వ నిర్వాకంపై ప్రజల్లో చర్చ



తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

తణుకు అర్బన్: పేదల విద్యకు ఆర్థిక అడ్డంకులు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో విద్యారంగంలో సంక్షేమం జోడించి అందరికీ విద్య అందించిన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారు. దీంతో పేదల పిల్లలంతా బడిబాట పట్టి ప్రస్తుతం ఉపాధి దిశగా సాగుతున్నారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే 1 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అమ్మ ఒడి రూపంలో రూ. 15వేలు అందచేశారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పనులు మాన్పించి పాఠశాలలకు పంపించారు. అంతేకాకుండా విద్యాదీవెన, విద్యాకానుక, ఫీజురీయింబర్స్‌మెంట్, వసతిదీవెన, గోరుముద్ద, ఐబీ సిలబస్, విదేశీ విద్య వంటి సౌకర్యాలు పేదలకు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలన్నీ నాడు నేడు నిధులతో రూపురేఖలు మార్చేయడమే కాకుండా నూతన భవన నిర్మాణాలు, అధునాతనమైన డెస్కులు, బెంచీలు, సురక్షిత తాగునీరు, టాయిలెట్స్, డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెరిగింది. విద్యాకానుక పథకంలో భాగంగా పిల్లలందరికీ యూనిఫామ్, షూస్, టై, బ్యాగ్ వంటి సౌకర్యాలు కల్పించి విద్యావ్యవస్థను ప్రక్షాళన చేశారు. దీంతోపాటు 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు ఉచితంగా అందచేసి డిజిటల్ విద్యకు ఉత్తేజాన్ని కలిగించారు.

పేదల విద్యకు ప్రాధాన్యత ఏది?

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతుండగా ఇంతవరకు విద్యార్థులకు ఎటువంటి సంక్షేమం అందచేయలేదు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేయగా, గోరుముద్దను సైతం నాసిరకంగా మార్చేయగా నాడునేడు ఊసేలేకపోవడంతో తల్లితండ్రులు సైతం విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంలేదంటూ గగ్గోలు పెడుతున్నారు. నీకు రూ. 15వేలు అంటూ కూటమి నేతలు ఎన్నికల ముందు హడావుడి చేశారని ఇప్పటికే ఒక ఏడాది ఎగ్గొట్టేశారని విమర్శిస్తున్నారు. వాయిదాలు వేసుకోవడం సరిపోతుందని, ఒకేసారి ఇద్దామా, రెండు పర్యాయాల్లో ఇద్దామా అంటూ ఏడాది గడిపేశారని, ఫీజురీయింబర్స్‌మెంట్ అయితే పిల్లల తల్లితండ్రులు ఫీజు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందంటూ వాపోతున్నారు. ఇప్పటికే డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులు తమ సర్టిఫికెట్స్ కోసం తామే ఫీజు చెల్లించాల్సి వచ్చిందంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తామన్న కూటమి నేతలు ఏడాది గడిచిపోతున్నా ఇంతవరకు ఎటువంటి హామీలు నెరవేర్చలేదని ప్రజానీకం బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

వర్తక సంఘాలు సామాజిక సేవల్లో భాగస్వామ్యం కావాలి



తణుకులో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న కిరాణా వర్తక సంఘం

తణుకు అర్బన్: వర్తక సంఘాలు సామాజిక సేవల్లో భాగస్వామ్యులు కావాలని శాసన మండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకులో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన సంఘ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించేందుకు కిరాణా వర్తకులు పాటుపడాలని కోరారు. ప్రస్తుత మార్కెట్‌లో మాల్స్ లాంటి బహుళ జాతి కంపెనీల తాకిడి అధికంగా ఉన్నప్పటికీ నాణ్యత, ధరల్లో వినియోగదారులకు నమ్మకం కలిగేలా విక్రయాలు జరిపితే వ్యాపారరంగంలో ఎటువంటి ఒడిదుడుకులు ఉండవని స్పష్టం చేశారు. సంఘ భవనంపై వచ్చే ఆదాయాన్ని పేద వర్తకులకు, సేవా కార్యక్రమాలకు వినియోగించాలని రవీంద్ర నాథ్ కోరారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనాథ్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, వర్తక సంఘ అధ్యక్షుడు మాజేటి ప్రకాష్, షర్మిష్ఠ వీరన్న, ఆకుల బాబు, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, వావిలాల సరళాదేవి పాల్గొన్నారు.

మళ్లీ వానా కాలం చదువులొచ్చాయ్

- భ్రష్టు పడుతోన్న విద్యా వ్యవస్థ
- ఏడాదిలో చతికిలబడిన చదువులు
- నాటి జగన్ పాలన చదువులే నేటి రికార్డులు



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తి నిర్మాణంలో అదనపు తరగతి గదులు

ఆకివీడు: మళ్లీ వానా కాలం చదువులొచ్చాయని తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక విద్యకు, విద్యా బోధనకు విద్యార్థులు దూరమైపోతున్నారు. వ్యవస్థల్ని జగన్ ప్రభుత్వం ధ్వంసం చేసిందని చెప్పుకువచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవస్థల్ని కూనీ చేస్తుందని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానా కాలం చదువులకు స్వస్తి చెప్పి ఆధునిక విద్యా వ్యవస్థను ఐదేళ్లు అమలు జేసిన జగన్ పాలనలో విద్యార్థులు తమ మేథస్సుకు పదును పెట్టి విద్యలో పోటీ పడ్డారు. అంతర్జాతీయ స్థాయి విద్యనందుకుంటున్నారు. డిజిటల్‌బోధన, బైజూస్ ట్యాప్‌లతో విద్యార్థుల్లో చదువుల పట్ల ఆసక్తి పెరిగింది. 8, 9, 10 తరగతి విద్యార్థులు ఆధునిక విద్యా బోధనతో మంచి ఫలితాల్ని పొందుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి విద్య రంగాన్ని వెనక్కి తీసుకు వెళ్తుతోందని ఆరోపిస్తున్నారు.

నాడు కార్పొరేట్‌ను తలదన్నిన సర్కారు స్కూళ్లు

కార్పొరేట్ విద్యావ్యవస్థను తలదన్నే విధంగా జగన్ పాలనలో సర్కారు బడులు అభివృద్ధి చెందాయి.

నియోజకవర్గంలో స్కూళ్లు	
ఆకివీడు	58
కాళ్ల	60
పాలకోడేరు	55
ఉండి	61

నాడు-నేడులో నియోజకవర్గంలోని పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు నూతన శోభను సంతరించుకున్నాయి. పేద విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం, ట్యాబ్‌లలో, ఐఎఫ్‌బీ ప్యానెల్స్ ద్వారా విద్యా బోధన జరిగింది. ఆహ్లాదకరమైన బల్లలు, టేబుళ్లతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో ప్యాన్లు, లైట్ల మధ్య విద్యా బోధన జరిగింది. విద్యార్థులకు టై,బెల్టు,షూ, యూనీఫాంలు అందజేశారు. ఆరోగ్యకరమైన గోరుముద్ద,విశాలమైన క్రీడా ప్రాంగణంలో అన్ని క్రీడలకు సంబంధించిన పరికరాల్ని అందుబాటులో ఉంచారు. పేదలకు విదేశీ ఉన్నత విద్య చదువుకు ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు సంస్కరణల తిరోగమనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే విద్యా సంస్కరణలు తిరోగమనం పట్టాయి. నాడు-నేడులో నిర్మాణ దశలో ఉన్న భవనాలకు నిధులులేక వెలవెలలాడుతోన్నాయి. ఆయా స్కూళ్లవద్ద అదనపు తరగతి గదుల అసంపూర్తి నిర్మాణం దిష్టిబొమ్మల్ని తలపిస్తోందంటున్నారు. మరికొన్ని స్కూళ్లకు రంగుల, విద్యుత్, మంచినీటి సదుపాయం వంటివి సమకూర్చాల్సి ఉంది. సర్కారు బడులు కళావిహీనమవుతోన్నాయి. మే నెలలోనూ తల్లికి వందనం లేదు. ముగ్గురున్నా, ఐదుగురు న్నా ఇస్తామన్నారు. ఫీజురీయంబర్స్‌మెంట్ అందలేదు. విద్యా దీవెన, వసతి దీవెనలు రాలేదని వాపో తున్నారు. తరగతిగదుల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నచందంగా ఉందని ఆరోపిస్తున్నారు.

అమ్మ ఒడి అందలేదు



అమ్మఒడి అందలేదు. మా పిల్లలు ఇద్దరికీ అమ్మ ఒడి వస్తుందని ఆశపడ్డాను. మే నెలలో ఇస్తామన్నారు. ఇంకా ఇవ్వకపోవడం విచారకరం. ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీష్ మీడియంను కొనసాగిస్తే విద్యార్థులకు బాగుండేది. మా ఇంట్లో చేయూత పథకం నిలిచిపోయింది.

– మద్దిరాల మేరీ రాణి, సిద్ధాపురం, ఆకివీడు మండలం

బలుసులమ్మ తల్లికి విశేష పూజలు



విశేష అలంకరణలో బలుసులమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ తల్లికి విశేష పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షణలో అమ్మ వారి దేవస్థానంలో శుక్రవారం అన్న ప్రసాద వితరణ కావించారు. దాతలు సహా య సహకారాలు అందించారు. దాతలు కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, అరుణ కుమారి, ఆవుల శ్రీనివాసరావు, వరలక్ష్మి, వడ్డీ కాసులు, మహాలక్ష్మి దేవి తదితరులు సహకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ అభయ గణపతికి విశేష పూజలు

స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణయోగ ధ్యాన మందిరంలో నెలవైయున్న శ్రీ అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

కార్మిక వర్గం ఏకం కావాలి

తణుకు అర్బన్: కార్మికవర్గం పక్షాన నిజాయితీగా పోరాటం సాగించేది సీఐటీయూ ఒక్కటేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీప్రతాప్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు, నిర్బంధాలు, అక్రమ కేసులతోపాటు విజయాలు సొంతం చేసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ నాయకులు గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరరావు, అంబటి బ్రహ్మాజీ, రామకృష్ణ, వైటీ రామకృష్ణ, గోవిందరావు, త్రిమూర్తులు, పీఎల్ నర్సింహారావు, పి రాజా, పి. దక్షిణామూర్తి, ఎం. రమేష్, ముత్యాల రావు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్స్ రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రైల్వే గూడ్స్‌షెడ్డు, అపరాల మార్కెట్, కూరగాయల మార్కెట్, చింతపండు మార్కెట్, ఉల్లిపాయల మార్కెట్, పండ్ల మార్కెట్, యార్డు, ట్రాన్స్‌పోర్టు, ఎరువులు కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయం తదితర కార్యాలయాలు వద్ద సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, చల్లా చంద్రరావు, జవ్వాది శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.



తణుకులో సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన ప్రతాప్, కార్మికులు



ఉల్లిపాయల మార్కెట్ వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

డైమండ్స్ నూతన కమిటీ ఎంపిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ నూతన కమిటీ ఎంపిక శుక్రవారం జరిగింది. కమిటీ అధ్యక్షుడు మద్దుకూరి మెహర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కోటి విజయ్ కిషోర్, ట్రెజరర్‌గా బడుగు చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటర్‌గా పేరిచర్ల మురళీకృష్ణంరాజు, చైర్‌పర్సన్‌గా కె.రమణయ్య, ఉపాధ్యక్షుడిగా కాళ్ళ గోపికృష్ణ, చెన్నా రెడ్డి సతీస్, మానేపల్లి సునీల్ కుమార్, పెన్మత్స గోపాల్ రాజు, వివిధ విభాగాల చైర్‌పర్సన్స్, సహాయ కార్యదర్శులు, సభ్యులతో నూతన కమిటీ ఎంపిక జరిగింది. మరిన్న సేవలు అందిస్తామని చెప్పారు. త్వరలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందని, సభ్యులు విజయవంతం చేయాలని కోరారు.



మద్దుకూరి మెహర్ ప్రసాద్



కోటి విజయ్ కిషోర్



బడుగు చంద్రశేఖర్

వసతి గృహాల్లో పరిశుభ్రత అవసరం

అత్తిలి: వసతిగృహాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, విద్యార్థులు దోమకాటు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెనుగొండ, పెనుమంత్ర, అత్తిలి మండలాల్లో ఉన్న 22 హాస్టల్స్ లో మలాథియాన్ 25 శాతంతో ఫోకల్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ చేయించినట్లు సబ్ యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు తెలిపారు. కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా ముందస్తు జాగ్రత్తలలో భాగంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు శుక్రవారం స్ప్రేయింగ్ చేయించినట్లు తెలిపారు. హాస్టల్స్ పరిశుభ్రత విషయంలో హాస్టల్ సిబ్బందికి పలు మార్గదర్శక సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్ వైజర్ కె. సత్యనారాయణ, ఆయా హాస్టల్స్ పరిధిలోని గ్రామ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, హాస్టల్స్ సిబ్బంది పాల్గొన్నారు.



అత్తిలిలో హాస్టల్‌లో మలాథియాన్ మందును స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

దేశాలమ్మవారి అన్నసమారాధన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లాకు సెంటర్ చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మ జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన ఏర్పాట్లు చేశారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాలు సదుపాయాలు, అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ఆర్డీఓ కార్యాలయంలో బాలలు బడికి రండి పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉన్న ఈరోజుకూడా పిల్లలను బడిలో చేర్పించకపోవడం చాలా దారుణమన్నారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. యలమంచిలి, మొగల్తూరు, కాళ్ల, ఉండి, ఆకివీడు తహసీల్దార్లు గ్రంధి పవన్ కుమార్, దుర్గాకిషోర్, సుందర్‌సింగ్, నాగార్జున, రంగసాయి పాల్గొన్నారు.



బాలలు బడికి రండి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విద్యాసామగ్రి సిద్ధం

కాళ్ల: గత విద్యాసంవత్సరం చివరిలో సంబంధిత శాఖ వేసిన అంచనాలు ఆధారంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నామని కాళ్ళ ఎంఈఓ- 2 వేంద్ర వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా కోపల్లె స్టాక్ పాయింట్లో భద్రపర్చిన విద్యాసామగ్రిని సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ 60 పాఠశాలలు ఉన్నాయన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో తొలిరోజే సామగ్రిని అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

CHANGE OF NAME

I, EMMANDI MUTYAVATHI, R/o. 6-5-5, Kommayi Cheruvu Gattu, Tanuku, W.G Dist., A.P., Prevously Called As IMANDI MUTYAVATHI Has Been Changed My Name As "EMMANDI MUTYAVATHI". My Name Hereinafter Called As "EMMANDI MUTYAVATHI" In Future Transactions.

EMMANDI MUTYAVATHI

భవిష్యత్ అవసరాలకు పొదుపు తప్పనిసరి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి మహిళ భవిష్యత్ అవసరాలకు పొదుపు తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మాధంపల్లి, పడాల గ్రామాల్లో ఆర్థిక అంశాల నిర్వహణ – పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పడాలలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబంలో భార్యాభర్తలు ఇరువురు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, ఇరువురు సమన్వయంతో ఆదాయ, వ్యయాలను బేరీజు వేసుకుని, కుటుంబాన్ని ముందుకు నడిపించాలన్నారు. వీవోఏ జి.సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కే.బంగారమ్మ, టి. అన్నపూర్ణ, ఎంఎస్‌కే సత్య, ఎంఎల్‌హెచ్‌పీ యాని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పడాల అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి

భీమవరంలో సీపీఎం సమైక్యత యాత్ర

భీమవరం: అమాయక ప్రజలు ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోడానికి ప్రజలంతా ఏకం కావాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ అన్నారు. సీపీఎం దేశవ్యాపిత పిలుపులో భాగంగా సమైక్యత యాత్ర భీమవరంలో శుక్రవారం బస్టాండ్ దగ్గర నుంచి ప్రారంభమైంది. ఆపరేషన్ సింధూర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి అందరూ సంఘీభావం తెలిపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనసాగించలేకపోయిందన్నారు. దాడులకు గురైన బాధితులను ఆదుకోవడం, పరామర్శించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

సీబీసీఎన్‌సీ ఆస్తుల్ని కాపాడుకుంటాం!

ఆకివీడు: సీబీసీఎన్‌సీకి చెందిన ఆస్తుల్ని రక్షించుకుంటామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రెవ. డాక్టర్ ఎం. విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక అయిభీమవరం రోడ్డు వైపు, పెదపేటకు చేర్చి ఉన్న స్థలాల్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రిస్టియన్ సంస్థలకు చెందిన అన్ని ఆస్తులకు సంబంధించి తమ వద్ద రికార్డులున్నాయన్నారు. బ్రిటీష్ కాలంలోనే 1820 ప్రాంతలో తమ సంస్థకు దస్తావేజులతో కూడిన ఆస్తుల్ని ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి పాస్టర్, సీబీసీఎన్‌సీ రాష్ట్ర నాయకుడు గూడపాటి జోసఫ్‌రాజు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలి

భీమవరం: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా జూన్ 5తేదిన మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని అన్ని కోర్టుల ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, సేవాసంస్థ చైర్మన్ బి లక్ష్మీ నారాయణ చెప్పారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, గృహ హింస వంటి కేసులను రాజీ చేసుకోవచ్చునన్నారు. సివిల్ కేసు రాజీ పడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కాలాన్ని, వ్యయాన్ని ఆదా చేసుకోవచ్చునని జడ్జి తెలిపారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయాలని జడ్జి లక్ష్మీనారాయణ కోరారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం తణుకు

90102 23729
90100 68395
90100 51493

Office mail : tpgadvt@gmail.com